స్కెచ్

# నేల విడిచి సాము

"క్షేమేంద్ర"

విమర్శనకన్న ఊహాశక్తి ఎక్కువకలవాళ్ళల్లో సుబ్బారావొకడు. అలావుండటం మంచిదేనా లాభకరమా కాదా అంటే నే చెప్పలేను. ఒకరి కమృతం ఇంకొకరికి హాలాహలం అని మనమెరిగిందే. ఫాదర్ బ్రౌన్ విషయంలో అది అద్భుతమైనపన్లుచేసింది. మరి మిగతాచోట్ల? ముఖ్యంగా సుబ్బారావు విషయంలో అది సాధించిన విజయాలమాట దేవుడెరుగు కాని ఒక్కొక్కప్పుడు విచిత్రవృత్తులుపోయి మరీ అన్యాయంగా స్నేహితులు బిక్కచచ్చిపోయేట్టు చేసేది. అందుకనే అనుకుంటూ, నాలాంటి నళ్ళరాళ్ళ నొకళ్ళిద్దర్ని మినహాయిస్తే ఎవరితోనూ అతనిస్నేహం ఎక్కువ కాలం నిలబడలేదు.

అతనితో పరిచయం అయిందగ్గర్నుంచీ నన్నాశ్చర్యపరిచిందీవిషయమే. ఆడవాళ్ళకి ఆరోజ్ఞానం ఏదో వుంటుందట. ఆతనికీ అల్లాంటిదేదో వున్నట్టు మాట్టాడేవాడు. వాడిమాటల వెనక బలమైన తర్కమంటూ ఒకటి లేకపోవడం, ఈ ఊహకొక్కంత కారణం.

సుబ్బారావు మాయింటికొచ్చాడు. బంగాళాఖాతంలో చక్రవాతాలు ముమ్మరంగా రేగి కుమ్ములాడుకునే నవంబర్లో ఓనాడు. వెధవఊరు, పట్టుమని పదినిమిషాలు ముసురుగా ఉంటేసరి ఉప్పెనొస్తోందని కలెక్టరుకి పైవాళ్లెవళ్ళో టెలిగ్రాం కొట్టారని ఎవడో ఊదాడన్నమాటే! నామట్టుకు నాకూ ఆ భయంలేకపోలేదు. అందుకనే ఒత్తిడి గుండం ఏ తీరుగా ప్రయాణం సాగిస్తున్నదీ తేల్చి చూసుకుని తృప్తిగా పత్రిక అవతల పారేస్తూ అతన్ని ఆహ్వానించాను.

పిచ్చాపాటీ అయినాక, ఉన్నట్టుండి అన్నాడు, "నేను శకుంతల్ని ప్రేమిస్తున్నానోయ్" అని.

"సరిపో, ఇంతకీ ఎవరాశకుంతలమ్మ?" .. లోకంలోచాలామందిఉన్నారు అదే పేరుతో మరి.

"ఇంకెవరుంటారు, మనసహాధ్యాయిని శకుంతల్నే." నావేపుపరీక్షగా చూస్తూ అన్నాడు.

"సరే, బాగుంది" అన్నాను ఇంకేమనాలో తోచక.

"అంతేనన్న మాట నువ్వు చెప్పేది?"—నా సమాధానం వాడికి రుచించలేదన్నమాట స్పష్టం.

నవ్వుతూ అన్నాను, "అంతకాక, ఏమనాలో ఏమంటే నీకుతృప్తిగా ఉంటుందో చెప్పుమరి?"

"ఏమంటేనేంలే? శకుంతల్ని ప్రేమించవచ్చునంటావా?"

"అంటే? నువ్వడిగేది నా సలహా, నా అనుమతా?"—నా వేళాకోళం వాడికి కోపం తెప్పిస్తోందని గమనించి వెంటనే అన్నాను, "శకుంతల ప్రేమించతగ్గదే. ఎవరన్నా ప్రేమించొచ్చు కూడా. కాని శకుంతల తిరిగి ప్రేమిస్తుందాలేదా అనే విషయంకూడా ముఖ్యమేగా?"

నిజంగా శకుంతల చూడటానికి బాగుంటుంది. పల్చగా, పచ్చగా, మనిషితిన్నగా, నడుం సన్నగా. చదువుతున్నది. ఇంకేమీ అక్కర్లేని వాళ్ళకివిచాలు.

"అలాగయితే, శకుంతల్ని నువ్వుకూడా ప్రేమించావంటాను. నిజమేనా?" కొంచెం ఉత్సాహంగా అన్నాడు.

"నీఊహ తప్పంటాను. నామిత్రులికి అడ్డొచ్చేటంత దుర్మార్గుణ్ణి కాను"...నవ్వేశాను. వాడు నామాట నమ్మలేదు.

"అయితే, దీనికేమంటావ్? నీ 'చెర్రీఆర్చర్డ్'లో కనపడింది."

నా ముందొక ఫోటో పడేశాడు. రెండు జడలూ ముందుకేసుకుని, నుదుటి మీదికి ముంగురులు తోసుకుని నవ్వుధారలొలకబోస్తూ శకుంతల.

"నిజం, నువ్వునామాట నమ్ము. ఇదినాది కాదు. శకుంతల నన్ను ప్రేమిస్తుందని నువ్వు నమ్ముతావా? నీముందు మాధవరావా పుస్తకం తీసుకెళ్ళాడు నా దగ్గర్నుంచి. బహుశా వాడందులో పెట్టి మరచిపోయుంటాడు" సీరియస్గాఅన్నాను.

సుబ్బారావు ఆలోచిస్తున్నాడు.

శకుంతల్ని నేను ప్రేమించలేనని సుబ్బారావుకేం తెలుసు? ఆమెకి తగనిగర్వం; మనిషిని మనిషినిగా గౌరవించదు, ఎదటి వాడితో తనకినచ్చిన కొత్తదనంగాని గొప్పదనంగాని కనిపిస్తేతప్ప. మాధవరావింట్లో తటస్థపడింది ఓరోజు కథా

నాయిక. దగ్గిరో, దాపో నాకు తెలియదు వాళ్లేదో విధంగా బంధువులు. వాడు మమ్మల్ని పరిచయ పరిచిన తర్వాతకూడా ఆమె చూపిన ముఖభావానికి నిర్లక్ష్యానికి నా అహం దెబ్బ తిన్నది. దానికన్నకూడా నే సహించలేక పోయిందేమిటంటే నేను కథలు రాస్తానని యథాలాపంగా వాడు బయటపెట్టినాక ఆమెకి ఒక్కసారిగా ఉబుక్కొచ్చిన ఆదరం. తనకి కథలురాయాలని అభిలాషట కాని చేతకాదట. "ఇప్పటికే రాసేవాళ్ళు ఎక్కువయ్యారని మీరను కోరూ?" అన్నాను. "ఏ పేరుతో రాస్తా"రని అడిగింది, "చెప్పేస్తే, మీ సద్భావం పోతుంది కాబట్టి చెప్ప"నన్నాను. చివరకి చెప్పకుండానే వీడ్కోలు పుచ్చుకొచ్చేశాను. ఆమె కొంచెం చిన్నపుచ్చుకుంది. తనమాట కెదురు చెప్పిన కొద్ది మందిలో నేనొకణ్ణనుకుంటాను.

నా ఆలోచనా ప్రవాహానికి అడ్డుతగిలాడు సుబ్బారావు. "అంటే నీస్థానే మాధవరావుని నిలబెడితే సరిపోతుందన్నమాట. ఈ ఫోటోనిబట్టి చూస్తే వ్యవహారం చాలాదూరం పోయినట్టు కూడా తెలుస్తోంది."

"లాభంలేదురా అబ్బీ. నీ పరిశోధనలన్నీ డొంకతిరుగుడుగా ఉన్నయ్. వాళ్ళకేదో చుట్టరికం ఉన్నాదన్న సంగతి తెలిస్తే నీ అభిప్రాయం మార్చుకుంటావు. అదీకాక, శకుంతల ఓ గెజిటెడ్ ఆఫీసరుకి తక్కువ ఎవణ్ణీ చేపట్టదని నా నమ్మకం. ఆమాటకొస్తే పెద్దచదువు చదువుతూన్న ప్రతి ఆడదానివాంఛా అదేనని నా అనుమానం"— సూక్ష్మంలో తేల్చేశాను.

"నువ్వు ప్రతిదీ నల్లకళ్ళద్దాల్లోంచి చూస్తావు. నీ ప్రకారంచూస్తే లోకంలో మంచి అంటూ కనపడదు" అన్నాడు.

"నీయిష్టం, నా అభిప్రాయం చెప్పాను. శకుంతలలాంటి వాళ్ళంతా ప్రేమించేది పెళ్ళిచేసుకున్న వ్వాడి హోదాని, ఆ మనిషికాదు. ఇహ మంచి అంటావ్? ఏదిమంచి? ఎవరికి మంచి? మనిషి మనిషికీ నిమిష నిమిషానికీ మారిపోయే మన నైతికప్రమాణాల్లో మంచి వున్నదంటావా? నే నటువున్నదని ఒప్పుకోను. చూడు, ఇది నా మతం నన్ననుసరించు అని నేనిన్ను కోరను. నీకు నచ్చచెప్పటానిక్కూడా ప్రయత్నించను."

కొంచెంసేపుఊరుకుని నిష్కర్షగా అన్నాడు, "నేను శకుంతల్ని ప్రేమించటంలేదు."

నేను నవ్వాను. "ఆ మాట నాకు తెలుసు. ఇదిగో, ఒక్కవిషయంఅడుగుతా నిజంచెప్తావా? నువ్వు నిజంగా శకుంతల్ని ప్రేమించలా. ప్రేమిస్తున్నానని నాతోచెప్పావ్. కారణం నే ప్రేమిస్తున్నానని నువ్వు సిద్ధాంతీకరించుకుని నీ మాట కెలా చలిస్తానో చూద్దామనుకున్నావవునా?"

కొంచెం తెల్లబోయి నావంక చూస్తూ, "నా మనస్సులో లేనివన్నీ కల్పించుకుంటున్నావ్. నువ్విలా ఎందుకనుకోవాలో తెలుసుకోవచ్చా?" అన్నాడు.

"తప్పకుండా. నువ్వు నాతో అలా చెప్పడానికి నాకు మూడే కారణాలు కనిపిస్తున్నాయ్ ఒకటి వెనక చెప్పిందే. అంటే నన్ను పరీక్షచెయ్యడము, రెండు మీరెవరూ నాకడ్డురాకండి, శకుంతల ప్రేమకు నే హక్కుదారుణ్ణి అనడం, మూడు స్నేహితుణ్ణి కాబట్టి నాచెవిని వెయ్యడం. నువ్వా ఫోటో గనుక వెంటబెట్టుకు రాకుండావుంటే, నేనింత నిశ్చయంగా మొదటిదానివేపు మొగ్గే వాణ్ణి కాదు."

"నువ్వింత నిర్మొగమాటంగా ఎలా మాట్లాడ గలవ్? ఎదటివాళ్ళేమన్నా అనుకుంటారనన్నా వెనకాడవే?"

"నీకోపం రాకూడదు. ఇంకోసారి అలాగే మాట్లాడుతున్నా. చాలామంది నీ పాతస్నేహితులు జారిపోవడానికి కారణమేమంటావ్? నువ్వే. క్షమించు ఇలా అన్నందుకు. నీ తప్పులు నీకు చూపెడితేనన్నా సరిదిద్దుకుంటావేమోననే నా ఆశ. నిజం చెపుతున్నా. నీ ఒక్కడి దగ్గిరతప్పితే ఇంత కట్టె విరుపుగా నే నెక్కడా మాట్లాడ లేదు. నువ్వు నన్నేమనీ బాధపెట్టలేవు. నీతత్వం నాకు తెలుసుగా గాబట్టే మనం స్నేహితులుగా ఉన్నామనుకో. ఏమిటి? నామాట వినవూ?"

కిటికీలోంచి బలంగా చల్లనిగాలి వీస్తూంటే చేతులు పుచ్చుకుని ఒకరి కళ్ళల్లోకి ఒకరం చూస్తూ ఉండిపోయాం. బయట తుంపర పెద్దదయింది, ఆ వెంటనే జడివాన మొదలెట్టింది. వాన వచ్చినాక వెలుస్తుంది, వెలవకుండా వుండదు.